నమస్తే తెలంగాణ
# పెద్దపల్లి
5 కరీంనగర్, మంగళవారం 3 సెప్టెంబర్ 2024 PEDDAPALLI


వీణవంక: మామిడాలపల్లి శివారులో నీటి ప్రవాహానికి తెగిపోయిన రోడ్డు


జూలపల్లి–పెద్దాపూర్ మధ్య హుస్సేనిమియా వాగుపై నీట మునిగిన వంతెన


ధర్మపురి వద్ద ప్రవహిస్తున్న గోదావరి


మానకొండూర్ రూరల్: ఈదుల గట్టెపల్లిలో రోడ్డుపై వరద

## ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

కరీంనగర్ కార్పొరేషన్, సెప్టెంబర్ 2 : రాష్ట్రంలో వరద బాధితులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజమెత్తారు. వరదలతో రాష్ట్ర ప్రజలు అష్టకష్టాలు పడుతుంటే, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మొద్దు నిద్ర పోతున్నదని విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ పాలనలో వరదల సమయంలో బాధితులకు కేసీఆర్ అండగా నిలిచారని, స్వయంగా పరామర్శించి ధైర్యాన్ని నింపారని చెప్పారు. అప్పుడు తక్షణ సాయం కింద ములుగు జిల్లాకు ₹2.5కోట్లు, భూపాలపల్లికి ₹2కోట్లు, మహబూబాబాద్‌కు ₹1.50కోట్లు విడుదల చేశారని గుర్తుచేశారు. గతంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ రెడ్డి.. వరదల్లో చనిపోతే కుటుంబాలకు ₹25 లక్షలు పరిహారం అందిస్తామని చెప్పారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన మీరు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

### వంతెన దెబ్బతిని ఉద్యోగానికి పోలేదు



మాది పెగడపెల్లి మండలం నామాపూర్. నేను గోపాల్‌రావుపేటలో ఉంట. పదహారేండ్లుగా కరీంనగర్ వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న. ప్రతి రోజూ అప్ అండ్ డౌన్ చేస్తున్న. రోజూ 35 కిలోమీటర్లు ప్రయాణించి డ్యూటీకి వెళ్తా. తిరిగి సాయంత్రం వస్తా. మిగతా కాలాల్లో బాగానే ఉన్నా, వానకాలం వచ్చిందంటే ఇబ్బంది అవుతున్నది. రామడుగు వాగు వరదలకు బ్రిడ్జి దెబ్బతినడంతో రాకపోకలు నిలిపివేస్తున్నరు. ఇప్పుడు డ్యూటీకి పోలేని పరిస్థితి. కొత్త వంతెన పూర్తయింది. కానీ, అందుబాటులోకి తేలేదు. ఈదారి మీదుగా రోజూ వేలసంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటరు. అంత మందిని ఇబ్బంది పెట్టడం సరికాదు.

**- ఇనుగండ్ల వీరహన్మంతరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ (రామడుగు)**

### ఆ దేవుడే దిక్కు



కొన్నేళ్లుగా వెంకటాద్రికాలనీల ఉంటున్నం. వాన కాలం వస్తుందంటేనే వణికిపోతున్నం. జగిత్యాల పట్టణానికి కిలోమీటర్ దూరంలోనే ఉన్నా అరిగోస పడుతున్నం. చిన్నపాటి వర్షానికే గోవిందుపల్లె, వెంకటాద్రినగర్‌కాలనీ బ్రిడ్జి వరదకు నీట మునిగి రాకపోకలు నిలిచిపోతున్నయి. ఓపక్క ధరూర్ వాగు, మరోపక్క మోతె చెరువు, ఇంకోపక్క పొలాలున్నయి. ఒక్క బ్రిడ్జి మీద నుంచి తప్ప ఎటూ పోరాదు. నాలుగు నెలలు వనవాసం చేస్తున్నం. ఇండ్లలోకి వరద వస్తున్నది. బురద మేట వేస్తున్నది. ఇండ్లలో ఉండలేం.. బయటికి పోలేం. ఈ నాలుగు నెలలు ఎక్కడికన్నా పోతే బాగుండు అనిపిస్తంది. ఈ సమయంల మాకు ఆపదొస్తే ఆ దేవుడే దిక్కు. పోయిన వానకాలం ఒక సారి ఐదు రోజులు వరుసగా రాకపోకలు బంద్ అయినయి. చానా గోస పడ్డం. జేసీబీ సాయంతో బ్రిడ్జి దాటినం. ప్రతిసారీ జేసీబీలు ఎక్కడి నుంచి వస్తయి? మా గోడు ఎవరూ పట్టించుకోవాలి.

**- ఎం వెంకటరమణ, వెంకటాద్రికాలనీ (జగిత్యాల టౌన్)**

### వర్షాకాలం అంటేనే వణుకు



వానకాలం వస్తుందంటేనే మా ప్రకాశం రోడ్డు కాలనీవాసులకు వణుకు పుడుతున్నది. ఏటా వరదతో ఇండ్లలోకి నీరు చేరి తీవ్ర అవస్థలు పడుతున్నం. విలువైన వస్తువులు నీటిలో మునిగి పాడవుతున్నయి. ఎన్నికల వేళ హడావుడి చేసే నాయకులు కష్టాలు ఉన్నప్పుడు మాత్రం కనిపించరు. రాత్రి వేళల్లో వరదల్లో చిక్కుకుంటే ఆ దేవుడే దిక్కు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మా సమస్యకు పరిష్కారం చూపాలి.

**- సిరిపురం పావని, ప్రకాశం రోడ్డు కాలనీ (కోరుట్ల)**

### బిక్కుబిక్కుమని గడుపుతున్నం



చిన్నపాటి వర్షానికే మా ఝాన్సీ రోడ్డు కాలనీ ఇండ్లలోకి నీరు వస్తున్నది. విషసర్పాలు కొట్టుకు వస్తున్నయి. మా ఇంటి చుట్టూ నీరు చేరింది. పిల్లలతో బిక్కుబిక్కుమని గడుపుతున్నం. బయటకు వెళ్లేందుకు దారి లేక ఇంటిల్లి పాది భయపడుతున్నం. గతేడాది భారీ వర్షాలతో అర్ధరాత్రి వరద ఇంటిలోకి చేరింది. అప్పుడు అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డం. పాలకులు, అధికారులు మాగోడు పట్టించుకోవాలి.

**-గుండోజి మంగమ్మ, ఝాన్సీ రోడ్డు కాలనీ (కోరుట్ల)**


వెల్గటూర్: ఎండపల్లి మండలం చెగ్యాంపల్లిలో వర్షానికి కూలిన జెల్ల లింగయ్య పెంకుటిల్లు


రామడుగు :వరద ఉధృతికి దెబ్బతిన్న మోతె వాగు బ్రిడ్జి

# అతలాకుతలం

- రెండోరోజూ వాన • పలు చోట్ల కుండపోత
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఇండ్లలోకి వరద.. స్తంభించిన జనజీవనం
- కూలిన వంతెనలు.. తెగిన రోడ్లు
- నిలిచిన రాకపోకలు • పలు బస్సులు రద్దు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

**వాన కుండపోత పోస్తున్నది. రెండో రోజూ పలు చోట్ల దంచికొట్టింది. భారీ వర్షాలతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా అతలాకుతలమైంది. వరదలు పోటెత్తడంతో జనజీవనం స్తంభించిపోయింది. రోడ్లకు గండ్లు పడడం, వంతెనలు, కల్వర్టులు కొట్టుకుపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆదివారం నాటి వర్షానికి ఇండ్లలోకి చేరిన నీళ్లు ఇంకా కొన్ని చోట్ల అలాగే ఉండిపోయింది. అనేక చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి పడడంతో సరఫరాకు ఆటంకం ఏర్పడింది. రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నిలిపి వేసింది.**

**- పెద్దపల్లి, సెప్టెంబర్ 2(నమస్తే తెలంగాణ)**


జగిత్యాల టౌన్: గోవిందుపల్లె– వెంకటాద్రి కాలనీ మధ్యలో ప్రవహిస్తున్న వాగు


పెగడపల్లి: ఇండ్లలోకి చేరిన వరద


కోనరావుపేట: నిమ్మపల్లి బ్రిడ్జి వద్ద కోతకు గురైన రోడ్డు


కల్వశ్రీరాంపూర్ : శివాలయంలోకి చేరిన వరదనీరు

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఉమ్మడి జిల్లాలో జనజీవనం అతలాకుతలం అవుతున్నది. ఆదివారం ఒక్కరోజే అతి భారీ వర్షం పడడం, సోమవారం కూడా అక్కడక్కడా కుండపోత పోయడంతో ప్రజానీకం ఇబ్బంది పడాల్సి వచ్చింది. కరీంనగర్ నుంచి రామడుగు మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న వంతెన వరద దాటికి కొట్టుకుపోవడంతో వాహనాలను మోతె గ్రామం మీదుగా రామడుగుకు మళ్లించారు. కాగా, ఈ వంతెనను సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరిశీలించారు. పక్కన కొత్తగా నిర్మించిన వంతెనను మంగళవారం సాయంత్రంలోగా అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు మోతె వంతెనకు ఇరువైపులా మట్టి కోతకు గురికావడంతో ఏ క్షణంలోనైనా కుంగి పోయే ప్రమాదం ఉన్నదని అధికారులు చెబుతున్నారు. మోతె వాగు కూడా ప్రమాదకరంగా ప్రవహిస్తున్నది. ప్రస్తుతం ఆటోలు, ఇతర వాహనాలేవీ ఈ మార్గంలో నడవడం లేదు. మోతె వంతెన దెబ్బతింటే రామడుగు, పెగడపల్లి మండలాలకు రాకపోకలు నిలిచి పోయే ప్రమాదమున్నది. ఇక గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్ ఆనకట్ట జ్వలించడంతో శివారు గ్రామమైన ఇస్తారిపల్లి ప్రమాదంలో పడింది. రెండేళ్ల కింద నారాయణపూర్ రిజర్వాయర్ కట్ట తెగి పోవడంతో ఈ శివారు గ్రామం ముంపునకు గురైంది. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్తగా అధికారులు గంగాధర ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుతం పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చొప్పదండి మండలం రాగంపేట, ఆర్నకొండ మధ్యన ఉన్న పంది వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రెండు రోజులుగా రాగంపేట, రేవెళ్లె, పెద్దకుర్మపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిపి వేశారు. మానకొండూర్ మండలంలోని ఈదులగట్టెపల్లి, అన్నారం గ్రామాల్లో కల్వర్టుల మీదుగా వరద ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలకు నిలిపారు. లింగాపూర్, వెల్ది మధ్యన కల్వర్టు పొంగుతున్న కారణంగా రాకపోకలు నిలిచి లక్ష్మీపూర్, వేగురుపల్లి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గన్నేరువరం వెళ్లే మార్గంలో ప్రధాన రోడ్డు మీదుగా విపరీతమైన వరద పోతుండడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అతి భారీ వర్షాల నేపథ్యంలో 56 బస్సులు నిలిపి వేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. అందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కుంట, నర్సరావుపేట వెళ్లే రెండు అంతరాష్ట్ర సర్వీసులు కూడా ఉండగా, ధర్మపురి మార్గంలో 16 బస్సులను నిలిపివేశారు. జగిత్యాల డిపో నుంచి రాయికల్ వెళ్లే 8 బస్సులను రద్దు చేశారు. కరీంనగర్ సర్కిల్ పరిధిలో విద్యుత్ సంస్థకు ₹18.65 లక్షలు నష్టం జరిగినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. చెట్లు విరిగి పడడంతో 31 స్తంభాలు, 3 ట్రాన్స్‌ఫార్మర్లు, మరికొన్ని ఇన్సులేటర్లు దెబ్బతినడంతో గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని చెప్పారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 13 ఇండ్లు కూలినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. కరీంనగర్ జిల్లాలో సోమవారం ఉదయం నాటికి సగటున 51.4 మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదవగా, అత్యధికంగా చిగురుమామిడి మండలంలో 83.0 గంగాధర మండలంలో 82.4 మిల్లీ మీటర్లు పడింది.

- పెద్దపల్లి జిల్లా కేంద్రంతోపాటు జిల్లా అంతటా ఎడతెరిపి లేకుండా వర్షం దంచికొట్టడంతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఎలిగేడు మండలంలో అత్యధికంగా 103.5 మిల్లిమీటర్ల వర్షం కురవగా, జిల్లాలో సరాసరిగా 59.1 మిల్లిమీటర్ల వర్ష పాతం నమోదైంది. భారీ వర్షాలతో పెద్దపల్లి, మంథని పట్టణాల్లోని ఆర్టీసీ బస్టాండ్లు, ఉదయ్‌నగర్, పోలీస్ స్టేషన్ ఏరియాలతో పాటుగా వివిధ వాడలకు వరద నీరు భారీగా వచ్చి చేరింది. లోతట్టు ప్రాంతాల్లోని ఇండ్లల్లోకి వర్షపు నీరు రావడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. గోదావరి, మానేరు నదులకు వరద పోటెత్తడంతో మంథని డివిజన్‌లోని పరీవాహక ప్రాంతాలైన మంథని, ముత్తారం, రామగిరి మండలాల్లో లోతట్టు గ్రామాల రైతులను అధికారులు అప్రమత్తం చేశారు. మంథని మండలం పోతారం, విలోచవరం, ఉప్పట్ల, ఖాన్‌సాయిపేట, ఖానాపూర్, గుంజపడుగు, సిరిపురం, అడవిసోమన్‌పల్లి, నాగెపల్లి, స్వర్ణపల్లి, వెంకటాపూర్, మల్లారం, ఆరెంద, చిన్న ఓదాల, గోపాల్‌పూర్, ముత్తారం మడంలంలోని ఖమ్మంపల్లి, అడవిశ్రీరాంపూర్‌తో పాటు పలు గ్రామాల్లోని పొలాల్లోని వరద నీరు చేరింది. రామగిరి మండలంలోని సింగరేణి సంస్థ ఆర్జీ–3 డివిజన్ పరిధిలోని ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి కొంత విఘాతం కలిగింది.
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో అక్కడక్కడా వర్షం పడింది. చెరువులు ప్రమాదకర స్థాయిలో మత్తళ్లు దుంకాయి. గంభీరావుపేట మండలంలోని ఎగువ మానేరు ప్రాజెక్టు ఉధృతంగా మత్తడి దుంకుతున్నది. దీంతో దిగువన మానేరు వాగు రోడ్లపై నుంచి ఉప్పొంగి ప్రవహిస్తున్నది. గంభీరావుపేట–లింగన్నపేట, కోళ్లమద్ది, కొత్తపల్లి, శ్రీగాధ, ముచ్చర్ల ఆయా గ్రామాల మధ్య గత రెండు రోజుల నుంచి రాకపోకలు స్తంభించి పోయాయి. ఎగువ మానేరు ప్రాజెక్టుతోపాటు లోలెవల్ వంతెనల వద్ద పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు.
- జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ఎగువ ప్రాంతం నుంచి వస్తు న్న వరద నీటితో పలు కాలనీలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఆదర్శనగర్, ప్రకాశం, ఝాన్సీ రోడ్డు, బిలాల్‌పురా, పద్మపురి వాడ కాలనీల్లో అంతర్గత రహదారులు జలమయమయ్యాయి. పలువురి ఇళ్లలోకి నీళ్లు చేరడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటి చుట్టూ చేరిన వరద నీటితో బయటకు రాలేక అవస్థలు పడుతున్నారు.


సారంగాపూర్: పోచంపేట–నాగునూర్ రోడ్డు మధ్యలో కోతకు గురైన రహదారి


చొప్పదండి: ఆర్నకొండ – రాగంపేట వెళ్లే రోడ్డుపై ఉప్పొంగి ప్రవహిస్తున్న పందివాగు


కోరుట్ల రూరల్: జోగన్‌పల్లిలో డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద వరదకు కొట్టుకుపోయిన కల్వర్టు


జగిత్యాల రూరల్: అనంతారంలో దెబ్బతిన్న రోడ్డుపై నుండి రాకపోకలు పరిశీలిస్తున్న డీఎస్పీ రఘుచందర్


కొత్తపల్లి: పొలాల్లో ఇసుక మేటలు


జగిత్యాల: మోతె బ్రిడ్జిని పరిశీలిస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత


కరీంనగర్: గుంతలమయంగా వెలిచాల ఎక్స్‌రోడ్డు వైపు నుంచి జగిత్యాల వెళ్లే రహదారి


కరీంనగర్: ప్రభుత్వ దవాఖానలో మందులు తీసుకునేందుకు క్యూలో రోగులు

## దవాఖానలు కిటకిట

భారీ వర్షాలతో పాటు పట్టణాలు, గ్రామాల్లో అపరిశుభ్ర వాతావరణం కారణంగా సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. దీంతో దవాఖానలకు రోగుల తాకిడి పెరిగింది. ముఖ్యంగా కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన దవాఖానకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి తరలివస్తుండడంతో ఓపీ సంఖ్య గణనీయంగా నమోదవుతున్నది. ఓపీ నమోదు, పరీక్షలు, మందుల కోసం గంటల తరబడి క్యూలో వేచి చూడాల్సి వస్తున్నది. సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో కొందరు రోగులు క్యూలో నిల్చోలేక నిస్సత్తువతో ఆవరణలోనే పడిపోతున్నారు.

**- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్**


జ్వర పీడితులతో కిటకిటలాడుతున్న వార్డు